Bhole Bhayya
(Telugu)

భోలా భయ్యా

మూలం
మాయల్ ఖైరాబాదీ (రహ్మాలై)

అనువాదం
యం.డి. యాఖూబ్

విషయ సూచిక

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

1. భోలా భయ్యా

భోలా భయ్యా చాలా అమాయకుడు. ఎవరు ఏదిచెప్పినా అది నిజమేనని నమ్మేస్తాడు. కాని ఎవరైనా అబద్ధం చెప్పారని తెలిస్తే చాలా బాధపడతాడు. ముస్లిం అయిఉండి అబద్ధం చెబుతున్నాడు సిగ్గులేదు... అంటాడు. భోలాభయ్యా పెద్దగా చదువుకోలేదు. కాని అప్పుడప్పుడు గ్రామ పాఠశాల గురువుగారి దగ్గరకు వెళ్ళేవాడు. ఆయన భయ్యాకు కొన్ని ధార్మిక విషయాలు నేర్పేవారు. భయ్యా వాటిని చాలా శ్రద్ధగా విని కంఠస్తం చేసుకునేవాడు. వాటికనుగుణంగానే నడుచుకునే వాడు.

భోలాభయ్యా ప్రతిరోజూ ఐదుపూటలా సామూహిక నమాజ్‌లో పాల్గొనే వాడు. తాను స్వయంగా హలాల్ (ధర్మసంపాదన) తింటూ భార్యా పిల్లలకూ అదే పెట్టేవాడు.

భోలాభయ్యా ఓ గ్రామస్థుడు. అడవిలో కట్టెలు కొట్టి తెచ్చి నగరంలో అమ్మేవాడు. వచ్చిన దాంట్లోనే సంతృప్తి చెంది సహనంతో జీవితం గడిపేవాడు. గ్రామస్థులు అన్నయ్యను బాగా పొగిడేవారు. భోలాభయ్యా ఎవరినీ మోసం చేసే వాడు కాదు. ఎల్లప్పుడూ నిజమే చెప్పేవాడు. అస్సలు అబద్ధం చెప్పేవాడు కాదు. మంచి పనులే చేసేవాడు. చెడు పనులు చేసేవాడు కాదు. ఒకవేళ తనవల్ల ఎప్పుడైనా ఏదైనా చెడు జరిగితే వెంటనే పశ్చాత్తాపం చెందేవాడు. మళ్ళీ అలాంటి చెడు జరక్కుండా ఉండటానికి జాగ్రత్త పడేవాడు. పొరుగువారి పనులు కూడా చేసిపెట్టేవాడు. దానికి ప్రతిఫలం ఆశించేవాడు కాదు. గ్రామస్థుల కష్టసుఖాల్లో పాలు పంచుకునేవాడు. అయినంతవరకు వారికి సహాయపడేవాడు. వారికోసం ఏమీ చేయలేకపోతే కనీసం ప్రార్థన అయినా చేసేవాడు. "ఓ అల్లాహ్! వీరి పనులు పూర్తి చెయ్యి" అని.

భోలాభయ్యా రాత్రి నిద్రపోయే ముందు కంఠస్తం ఉన్న సూరాలను పఠించి నిద్రపోయేవాడు. ఖుర్‌ఆన్ పఠించి నిద్రపోతే రాత్రంతా దైవదూతలు ఇంటిని పరిరక్షిస్తాయని అల్లాహ్ కారుణ్యం అవతరిస్తుందని చెబుతుండేవాడు.

ఒకరోజు రాత్రి భోలాభయ్యా ఎప్పటిలాగానే నిద్రపోయాడు. నిద్రలో ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచాడు. భార్యను నిద్రలేపి 'నీకేమైనా తలుపు తడుతున్నట్లు శబ్దం వినిపించిందా?' అని అడిగాడు. 'నాకు వినపడలేదండీ, ఏమిటీ విషయం?'అని అడిగింది భార్య. భయ్యా, భార్యతో నాకు 'ఎవరో తలుపు తడుతున్నట్టూ, రేపు రెండుసార్లు అల్లాహ్ నీ దగ్గరకు వస్తాడు, ఒకసారి నువ్వు అతని దగ్గరకు వెళతావు అన్నట్టు శబ్దం వినిపించింది' అన్నాడు.

అది విని భార్య చిన్నగా నవ్వుకుంది. 'మీరు నిజంగా చాలా అమాయకులండీ! నిద్రలో ఏదైనా కల చూసి ఉంటారు. అల్లాహ్ ఎవరి ఇంటికీ రాడు, ఎవరూ ఆయన దగ్గరకు వెళ్ళరు. ఇక నిద్రపోండి... చాలా రాత్రయింది' అంది భార్య.

తర్వాత భార్య నిద్రపోయింది. కాని భోలాభయ్యాకు మాత్రం నిద్రపట్టడం లేదు. అల్లాహ్ ఎలాగైనా తన ఇంటికి వస్తాడని అతనికి పూర్తి నమ్మకం ఏర్పడింది. ఆ సమయంలో ఎవరైనా దైవదూత తన ఇంటికి వచ్చి చెప్పి ఉంటారు అని అతని హృదయంలో నాటుకుపోయింది. ఇక ఆయనకు ఎలా నిద్రపడుతుంది? వెంటనే మంచం దిగి ఇల్లు శుభ్రం చేయసాగాడు. వస్తువులన్నీ చక్కగా సర్దిపెట్టసాగాడు.

భోలాభయ్యా ఇల్లు శుభ్రపరుస్తున్నాడు. అతని మనసులో రకరకాల ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. అల్లాహ్ సామాన్యుడు కాదు. ఆయన్ను ఎవరూ చూడలేరు. మరి ఆయనకు ఆతిథ్యమెలా ఇవ్వాలి? అల్లాహ్ ఏ వస్తువూ తినడూ, ఏదీ తాగడు. అసలు ఆయనకు ఏ వస్తువు అవసరమూ ఉండదు. ప్రతి శుక్రవారం ఇమామ్‌గారు ఖుత్బాలో ఈ విషయాలే చెప్పేవారు. అల్లాహ్‌కు ఏ వస్తువు అవసరమూ ఉండదు, అతనికి ఎవరి అవసరమూ లేదు. అందరికీ అతని అవసరముంటుంది. అల్లాహ్ అన్ని లోపాల నుండి పరమ పవిత్రుడు. అల్లాహ్ ఒక కాంతి. అల్లాహ్‌కు ఆకారంలేదు. ఆయన తలుచుకున్నది ఆదేశిస్తాడు. ఆయన ఆదేశించగానే అది అయిపోతుంది, అని.

భోలాభయ్యా ఇంకా ఆలోచనా లోకంలోనే ఉన్నాడు. అల్లాహ్‌ను ఎక్కడ కూర్చోపెట్టాలి? ఎలా కూర్చోపెట్టాలి? ఆయన కాంతి కదా? అని.

భోలాభయ్యా ఇలా అనేకవిధాలుగా ఆలోచిస్తూ తన పని తాను చూసుకుంటూ పోతున్నాడు. ఇంట్లో ఎలాంటి అశుద్ధత లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు.

తెల్లవారకముందే భయ్యా, ఇల్లంతా శుభ్రం చేసేశాడు. ఇల్లంతా సాంబ్రాణి పొగపట్టించాడు. ఫజ్ర్ అజాన్ విని మస్జిద్‌కు వెళ్ళాడు. నమాజ్ చేసిన వెంటనే ఇంటికి తిరిగొచ్చాడు. దివ్యఖుర్ఆన్‌లోని కంఠస్తం ఉన్న సూరాలన్నీ చదివాడు. తర్వాత కలిమా చదవసాగాడు. కలిమా చదువుతూ ఆకాశంవైపు చూస్తూ ఆలోచించసాగాడు; అల్లాహ్ 'కాంతి సింహాసనం'పై కూర్చుని వస్తాడు. ఆ సింహాసనాన్ని దూతలు ఎత్తుకొని ఉంటారు. జిబ్రాయీల్ (అలైహి) తోడుగా ఉంటారు. భోలాభయ్యా ఆకాశంవైపు నుండి దృష్టి మళ్ళించి తన ఇంటిని చూడసాగాడు. అల్లాహ్ నా ఇంటికి వస్తాడు. అన్నమాట అతని నోటినుండి ఒక్కసారిగా వెలువడింది. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. మాటిమాటికి ఆకాశంవైపు చూస్తున్నాడు. కాని అతనికి ఎక్కడా అల్లాహ్ కనబడలేదు.

అప్పుడు భోలాభయ్యా ఇలా ఆలోచించసాగాడు: 'ముందు అల్లాహ్ తన ఇంట్లో (అంటే మస్జిద్‌లో) దిగి ఆ తర్వాత నా ఇంటికొస్తాడేమో' ఈ ఆలోచన రాగానే భయ్యా మస్జిద్ వైపు చూశాడు. అక్కడెక్కడా అతనికి అల్లాహ్ కానరాలేదు. కాని అటువైపు నుండి ఓ వితంతు మహిళ రావడం కానవచ్చింది. ఆమె ఒళ్ళో చిన్న పాప ఉంది. ఆమె జనాల దగ్గర అడుక్కుంటోంది. అయ్యా! అల్లాహ్ మిమ్మల్ని చల్లగా చూస్తాడు. పాప ఆకలితో ఉంది. అల్లాహ్ పేర, పాపకు తిన డానికి ఏమైనా పెట్టండి, పుణ్యం ఉంటుంది. దైవం మిమ్మల్ని రక్షిస్తాడు, అంటూ బతిమాలుతోంది.

ఆ వితంతు మహిళ అడుక్కుంటూ భయ్యా వైపే వస్తోంది. భయ్యా చాలా మృదుస్వభావి. తన దగ్గరకు వచ్చిన వారెవరినీ అతను ఒట్టిచేతులతో పంపడు. 'అసలే ఆ రోజు అల్లాహ్ అతని ఇంటికి వస్తున్నాడు. మరి అల్లాహ్ ఎప్పుడొస్తాడో తెలీదు. భయ్యా ఒక నిరుపేదను పట్టించుకోలేదు అని అల్లాహ్‌కు తెలిస్తే ఇంకేమైనా ఉందా? అలా జరగడానికి వీల్లేదు. ఆ ఆలోచన వచ్చిన వెంటనే భయ్యా లేచి ఇంట్లోకెళ్ళి ఒక గుడ్డలో ధాన్యం నింపుకుని వచ్చాడు. ఆ పాప తల్లికి ఇచ్చేశాడు. మళ్ళీ జేబులో చెయ్యేసి చేతికందినంత డబ్బులు తీసి ఆమెకిచ్చాడు. ఆమెతో, 'వెళ్ళు..... త్వరగా వెళ్ళు... పాపకు కడుపునిండా అన్నంపెట్టు, ఈ రోజు పాపను ఏడిపించకు, నువ్వు కూడా సంతోషంగా ఉండు. జాగ్రత్త! ఈరోజు ఏడ్వకూడదు. నీకేమైనా కోరిక ఉంటే చెప్పు. ఈ రోజు నా ఇంటికి అల్లాహ్

అతిథిగా వస్తున్నాడు. నేను నీ గురించి ఆయనకు తప్పకుండా చెబుతాను' అన్నాడు.

ఆమెకు అతని మాటలు అస్సలు అర్థంకాలేదు. 'అయ్యా గారు! మా కోసం ప్రార్థించండి, జీవితం గౌరవంగా గడపాలని దుఆ చెయ్యండి'అని మాత్రం చెప్పి వెళ్ళిపోయింది.

భోలాభయ్యా కాసేపు ఆకాశంవైపు ఇంకాసేపు మస్జిద్ వైపు చూస్తున్నాడు. తన ఇంటికి అల్లాహ్ వస్తున్నాడనే సంతోషంతో ఆ రోజు ఆయన పనికి కూడా వెళ్ళలేదు. ఇంట్లోవాళ్ళు చెప్పినా వినలేదు. 'అల్లాహ్ ఇంటికొస్తుంటే నేను పనికి వెళ్ళడమేమిటి? ఆయన ఎప్పుడొస్తాడో ఏమో? ఆయన ఇంటికొచ్చినప్పుడు నేను ఇంట్లో లేకపోతే ఎలా? ఆయన ఏమనుకుంటాడు? మీకు అల్లాహ్ ఔన్నత్యం గురించి తెలీదు. ఆయన వచ్చినప్పుడు మీతో పొరపాటు జరగొచ్చు' అని అనసాగాడు.

భోలాభయ్యా ఇలా మాట్లాడడం, ఇంటిని శుభ్రపరచడం చూసి వీధి జనం నవ్వుకోసాగారు. కాని ఏం జరుగుతుందో అని అందరూ మౌనంగా ఆతురతతో చూడసాగారు.

పొద్దెక్కుతోంది. సూర్యుడు మెల్లగా ఆకాశంలో పైకెక్కుతున్నాడు. మధ్యాహ్నం రెండు గంటలైంది. అల్లాహ్ ఇంకా రాలేదు. అల్లాహ్ కోసం ఎదురు చూసి చూసి మధ్యాహ్నం అయింది. ఇక భోలాభయ్యాకు ఆకలేయసాగింది. ఏం చేయాలా? అని ఆలోచించసాగాడు. నేను అన్నం తినడానికి కూర్చున్నప్పుడు అల్లాహ్ వస్తే అన్న ఆలోచన రాగానే... అమ్మో!! ఇంకేమైనా ఉందా? అంతా తారుమారవుతుందేమో అనుకున్నాడు. కాసేపు దీర్ఘంగా ఆలోచించి తన భార్యను పిలుస్తూ; 'ఓ తబారక్ తల్లీ! తినడానికి కాసిన్ని శనగలు ఇవ్వు. ఇలా కూర్చునే ఒక్కో గింజ ఆరగిస్తూ అల్లాహ్‌కోసం ఎదురుచూస్తుంటాలే, అల్లాహ్ జొహ్ర్ నమాజ్ అయిన తర్వాత వస్తాడేమో' అన్నాడు.

అతని అమాయక మాటలకు తబారక్ తల్లి నవ్వుకుంది. శనగలు ఇచ్చి వెళ్ళిపోయింది. శనగలు తింటూతింటూ ఇంకో అరగంట గడిపాడు భోలాభయ్యా. ఇప్పుడు అతనికి నీళ్ళు దప్పిక అవుతున్నాయి. ఆరోజు అతను పెందలాడే లేచి కొత్తకుండల్లో నీళ్ళు నింపి ఉంచాడు. వాటిపై మూతలు కూడా కొత్తవే పెట్టాడు.

ఇంట్లోకెళ్ళి నీళ్ళు తాగి బయటికొచ్చాడు. బయట ఒకతను నించొని ఉన్నాడు. బహుశా అతను ప్రయాణికుడు కావచ్చు. అతను భోలాభయ్యా దగ్గరకు వచ్చి 'అన్నా! దాహం వేస్తోంది. కొంచెం నీళ్ళివ్వవూ' అని అడిగాడు. భయ్యా వెంటనే అతని కోసం కుర్చీవేసి ఇంట్లోకెళ్ళాడు. బెల్లంతో పానకం తయారు చేశాడు. అందులో పాలు కూడా కలిపాడు. చక్కగా మంచి పానకం తయారుచేసి ప్రయాణీకునికి ఇచ్చాడు. అతను కడుపునిండా పానకం త్రాగి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుని భోలాభయ్యా కోసం దుఆ చేస్తూ వెళ్ళిపోయాడు.

జొహర్ నమాజు సమయం అయింది. భయ్యా వెళ్ళి నమాజ్ చేసుకుని వచ్చాడు. అప్పటికీ అల్లాహ్ రాక గురించి ఎలాంటి సూచనలూ కనబడలేదు. భయ్యా కాసేపు కూర్చునేవాడు. కాసేపు అటూఇటూ తిరిగేవాడు. హఠాత్తుగా ఎవరో 'అస్సలాము అలైకుమ్ భలాభయ్యా' అని సలాం చేసినట్లు వినబడింది. సలాం శబ్దం విని భయ్యా ఉలిక్కిపడ్డాడు. అల్లాహ్ వచ్చేశాడేమో!ఆయనే సలాం చేశాడేమో! అనుకుని వెనక్కు తిరిగాడు భోలాభయ్యా. వెనుక అతనికి కరీంబాబా కనబడ్డాడు. ఓహో... ఇతనా సలాం చేసింది, అనుకుని 'వఅలైకుమస్సలాం కరీంబాబా' అని జవాబిచ్చాడు.

ఏంటీ సంగతీ? ఈ సమయంలో ఎక్కడికి వెళుతున్నావు? అంతా క్షేమమేనా? అని అతని యోగక్షేమాలు అడిగాడు భయ్యా. 'అల్లాహ్ దయవల్ల అంతా క్షేమమే భయ్యా... మియాజీ దగ్గరకు వెళుతున్నాను. మున్నాకు ఏమయిందో ఏమో? అర్థం కావడంలేదు. బాగా వాంతి చేసుకుంటున్నాడు. జ్వరం కూడా వచ్చింది. అని సమాధానమిచ్చాడు కరీంబాబా.

అలాగా! కొంచెం ఆగు కరీం... నా దగ్గర మందుంది. పోయిన శుక్రవారం పట్టణానికి వెళ్ళినప్పుడు సీసా మందు తెచ్చాను. ఇంకా సగం మిగిలి ఉంది. తీసుకెళ్ళువుగానీ.. అంటూ ఇంట్లోకెళ్ళి ఔషదం సీసా తీసుకొచ్చాడు.

సరే...నేను కూడా బాబును చూడడానికి వస్తాను. శుక్రవారం ప్రసంగంలో మౌల్వీగారు 'రోగిని పరామర్శించడానికి వెళ్ళడం కూడా పుణ్యమే' అని చెప్పారు. అంటూ భోలాభయ్యా కరీంబాబాతో కలిసి వారి ఇంటికివెళ్ళాడు.

ఇంటికెళ్ళి మున్నాకు చెంచాడు మందు వేశాడు. అక్కడే అరగంట గడిచింది. ఆ సమయంలో అల్లాహ్ తన ఇంటికి అతిథిగా వస్తున్నాడని

మరిచిపోయాడు భోలాభయ్యా. హఠాత్తుగా అతనికి ఆ విషయం గుర్తుకొచ్చింది. 'కరీంబాబా ఇదిగో... ఈ మందు సీసా తీసుకో... ప్రతి అర్ధగంటకూ గుక్కెడు నీళ్ళలో ఐదుచుక్కల మందు కలిపి బాబుకు తాపించు. అల్లాహ్ కోరుకుంటే బాబు త్వరగానే కోలుకుంటాడు. నువ్వేం బాధపడకు, నేను అల్లాహ్‌కు చెబుతాలే. నీకు తెలీదా? ఇవాళ మా ఇంటికి అల్లాహ్ వస్తున్నాడు. నువ్వేం బెంగపెట్టుకోకు' అంటూ వెళ్ళిపోయాడు భోలాభయ్యా.

కరీం బాబా తన ఆలోచనలో తానున్నాడు. భోలాభయ్యా చెప్పిన మాటలు అతనికి అస్సలు అర్థంకాలేదు. అర్థమయినా వాటిని అంతగా పట్టించుకోలేదు. ఔషధం సీసా తీసుకుని పెట్టుకున్నాడు.

భోలాభయ్యా ఆగమేఘాల మీద ఇంటికి చేరుకున్నాడు. ఎవరన్నా వచ్చారేమో అని కాళ్ళ గుర్తుల కోసం ఇంటి ప్రాంగణంలో చూడసాగాడు. కాని అక్కడ అతనికి ఎవరి కాళ్ళ గుర్తులూ కనబడలేదు. ఇక అతనిలో నిరాశ మొదలయింది. మరోవైపు అల్లాహ్ జాడలేదు. మెల్లగా అస్ర్ నమాజ్, ఆ తర్వాత మగ్రిబ్ నమాజ్‌లు కూడా పూర్తయ్యాయి. అప్పటికీ అల్లాహ్ రాకపోయేసరికి భోలాభయ్యా నిరాశతో నీరసించాడు.

మగ్రిబ్ నమాజ్ చేసుకుని మియాజీ ఇంటికెళ్ళాడు. భయం భయంతో జరిగిందంతా ఆయనకు చెప్పాడు. మియాజీ అంతా విని చిరునవ్వు నవ్వి 'అమాయకుడా! నిజంగా అల్లాహ్ నీ దగ్గరికి రెండుసార్లు వచ్చాడు. ఒకసారి నువ్వు అతని దగ్గరకు వెళ్ళావు కూడా! అదంతా నీకు అర్థంకాదులే' అన్నారు.

'అలాగా... మియాజీ... నాకేం అర్థంకావడం లేదు. మీరే అర్థమయ్యేలా చెప్పండి. అల్లాహ్ నా దగ్గరకు ఎప్పుడొచ్చాడు? నేను అతని దగ్గరకు ఎప్పుడు వెళ్ళాను. ఏంటీ ఇదంతా? నాకు తెలీకుండా అల్లాహ్ నా దగ్గరకు రావడం ఏంటీ? నేను అల్లాహ్ దగ్గరకు వెళ్ళడం ఏంటీ? అంతా అయోమయంగా ఉంది. నాకేం అర్థంకావడంలేదు. అంతా అర్థమయ్యేలా మీరే చెప్పండి మియాజీ... అన్నాడు భోలాభయ్యా అమాయకత్వం ఒలకబోస్తూ.

'నేను నీకు రెండు హదీసులు వినిపిస్తాను. ఆ తర్వాత అంతా నీకే అర్థమవుతుంది' అన్నారు మియాజీ. ఇలా వివరించసాగారు.

ప్రవక్త(స) ఇలా ప్రబోధించారు: ప్రళయ దినం నాడు అల్లాహ్ ఇలా

అంటాడు. ఓ ఆదమ్ పుత్రుడా! నేను నీకు అన్నం పెట్టమని అడిగాను. కాని నువ్వు నాకు అన్నం పెట్టలేదు. అప్పుడు దాసుడు ఇలా విన్నవించుకుంటాడు. ఓ ప్రభూ! నేను నీకు అన్నం పెట్టడమేంటీ. నువ్వే కదా... అందరికీ అన్నం పెడతావూ... ఆ తర్వాత అల్లాహ్ 'నీకు తెలీదు, నా ఫలానా దాసుడు నిన్ను అన్నం పెట్టమని అడిగాడు, కాని నువ్వు అతనికి అన్నం పెట్టలేదు. అప్పుడు నువ్వు అతనికి అన్నం పెట్టి వుంటే దానికి ప్రతిఫలం నా దగ్గర పొందేవాడివి అంటాడు.

మళ్ళీ అల్లాహ్ ఇలా అంటాడు : ఓ ఆదమ్ పుత్రుడా! త్రాగడానికి నేను నిన్ను నీళ్ళు అడిగాను, కాని నువ్వు నీళ్ళివ్వలేదు. అప్పుడతను 'ఓ ప్రభూ! నేను నీకు త్రాపించడమేమిటి? నువ్వే అందరికీ త్రాపించేవాడివి కదా! అంటాడు.

అప్పుడు అల్లాహ్ 'నా ఫలానా దాసుడు నిన్ను నీళ్ళు అడిగాడు. కాని నువ్వు అతనికి నీళ్ళు త్రాపించలేదు. ఒకవేళ నువ్వతనికి నీళ్ళు త్రాపించి ఉంటే దాని ప్రతిఫలం నా దగ్గర పొందేవాడివి' అంటాడు.

ఈ హదీసు వివరించిన తర్వాత మియాజీ అతనితో 'విన్నావా భయ్యా! నువ్వు ఫలానా అల్లాహ్ దాసునికి తినిపించావు, త్రాపించావు కదా!! ఇలా అల్లాహ్ నిన్ను పరీక్షించాడు. ఆ పరీక్షలో నువ్వు నెగ్గావు.

ఈ మాట విని భోలాభయ్యా ముసిముసి నవ్వులు నవ్వాడు. ఏదో ఆలోచించుకోసాగాడు. అప్పుడు మియాజీ రెండో హదీసు కూడా విను, నువ్వు అల్లాహ్ దగ్గరకు ఎలా వెళ్ళావో అర్థం అవుతుంది అన్నారు. ప్రవక్త(స) ఇలా ప్రబోధించారు.

ప్రళయ దినంనాడు అల్లాహ్ ఇలా అంటాడు : 'ఓ ఆదమ్ పుత్రుడా! నేను అనారోగ్యంగా ఉన్నప్పుడు నువ్వు నన్ను పరామర్శించడానిక్కూడా రాలేదు' అప్పుడతను ఇలా అంటాడు: ఓ ప్రభూ! నేనేంటి నిన్ను పరామర్శించడమేంటి? నువ్వు అన్ని లోకాలకు ప్రభువువి. అప్పుడు అల్లాహ్ ఇలా అంటాడు : 'నా ఫలానా దాసుడు అనారోగ్యంగా ఉన్నాడని తెలిసినా నువ్వతన్ని పరామర్శించడానికి వెళ్ళలేదు. నువ్వుగనక అతన్ని పరామర్శించడానికి వెళ్ళి ఉంటే అక్కడ నువ్వు నన్ను పొందేవాడివి.' (ముస్లిం, అబూహురైరా)

మియాజీ ఈ హదీసు వినిపించి 'భయ్యా! నువ్వు రోగిని పరామర్శించడానికి వెళ్ళి అతనికి మందు త్రాపించావు కూడా. రోగి మున్నా దగ్గర అర్థగంట

కూర్చున్నావు కూడా. అప్పుడు అర్ధగంటసేపు అల్లాహ్ నీ దగ్గరే ఉన్నాడు' అర్థం అయిందా!! అన్నారు.

భోలాభయ్యా ముసిముసి నవ్వులు నవ్వి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. అల్లాహ్ తనకు ఒక్క రోజులో తన ముగ్గురు దాసులకు సేవచేసే సౌభాగ్యాన్ని కల్పించి, తన సాన్నిధ్యాని ప్రసాదించినందుకు అల్లాహ్‌కు చాలా చాలా కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

2. ఇద్దరు ధనవంతులు

ఇద్దరు ధనవంతులు ఉండేవారు. వారు చనిపోయారు. చనిపోయిన తర్వాత వారిద్దరిని అల్లాహ్ ముందు ప్రవేశపెట్టడం జరిగింది. అల్లాహ్ వారిలో ఒకతన్ని 'ప్రపంచంలో నేను నీకు చాలా ధనం ప్రసాదించాను. నువ్వు ఆ ధనాన్ని ఏవిధంగా ఖర్చు చేశావు' అని ప్రశ్నించాడు. దానికి అతను ఇలా సమాధాన మిచ్చాడు:

ఓ అల్లాహ్! నువ్విచ్చిన ధనంతో నా భార్యా బిడ్డలను పోషించాను. వారికి ఖరీదైన ఆహార సౌకర్యాలు సమకూర్చాను. ధరించడానికి మంచి దస్తులు తెచ్చి ఇచ్చాను. పిల్లల్ని బాగా చదివించి ప్రయోజకులుగా చేశాను. నాకు ఇద్దరు ఆడపిల్లలు కూడా ఉన్నారు. ఒకమ్మాయిని షావుకారు కుమారునికిచ్చి వివాహం చేశాను. రెండో అమ్మాయిని ఒక మంత్రికిచ్చి వివాహం జరిపించాను. నేను చనిపోయే సమయంలో నా భార్యాపిల్లలు చాలా సంతోషంగా ఉన్నారు. నా భార్య దగ్గర కొన్ని వేల రూపాయల ఖరీదైన ఆభరణా లున్నాయి. ఆమె పేరు మీద ఒక ఇల్లుకూడా రాసిచ్చాను. ఆ ఇంటికి ప్రతి నెలా అద్దె కూడా వస్తుంది.

అదే విధంగా నా కుమారులకు ఖరీదైన బంగళాలున్నాయి. నేను మరణించే సమయంలో నా పిల్లలు చాలా ఆనందంగా జీవితం గడుపుతున్నారు.

ఓ అల్లాహ్! నేను నా ధనమంతా నా భార్యా పిల్లల సుఖ సంతోషాలకోసం ఖర్చుచేశాను. నేను మరణించినా కూడా నా భార్యాపిల్లలు సుఖసంతోషాలతోనే ఉండి ఉంటారను కుంటున్నాను. అందుకుని నాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది.

అల్లాహ్ అతను చెప్పిందంతా విని 'నువ్వు మరణించిన తర్వాత నీ భార్యా పిల్లలు ఎలాంటి పరిస్థితిలో ఉన్నారో నీకు తెలిస్తే నీ సంతోషం ఆవిరైపోతుంది. దుఃఖంతో తెగ బాధపడి ఏడ్వడం మొదలెడతావు' అన్నాడు.

ఆ తర్వాత అల్లాహ్ అతడికి అతని భార్యా పిల్లలు ఎలాంటి జీవితం గడుపుతున్నారో చూపించాడు. 'ధనవంతుని భార్యకు మరో పురుషునితో వివాహం జరిగింది. అతను చాలా చెడ్డవాడు. పనిచేసేవాడు కాదు. సంపాదించేవాడు కాదు. రేయింబవళ్ళు ఇంట్లోనే కూర్చునేవాడు. పచ్చి తాగుబోతు. ఎప్పుడూ మందు మత్తులో తూగుతుండే వాడు. అలాంటివాడితో సంసారం చేస్తున్నందువల్ల ధనికుని భార్య దగ్గర ఉన్న ధనమంతా ఖర్చయిపోయింది. ఆ తాగుబోతు ఆమెను విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. ఒక్కొక్క రూపాయి కోసం పరితపించే స్థాయికి దిగజారిపోయింది ఆమె పరిస్థితి. ఆ తర్వాత ఆమె అడుక్కుంటూ జీవితం గడపసాగింది.

భార్య దుస్థితి చూసిన ధనవంతుడి మనస్సు కకావికలమైంది. అతను బాధతో విలవిల్లాడిపోయాడు.

అప్పుడే ఏమయింది? నీ పిల్లలు ఎలా జీవితం గడుపుతున్నారో చూడు' అన్నాడు అల్లాహ్.

ధనికుడు తన పిల్లలు ఎలా జీవితం గడుపుతున్నారో ఆతురతతో చూడసాగాడు.

ఒకబ్బాయి జైల్లో ఉన్నాడు. రెండోవాడికి పక్షవాతం వచ్చింది. ఎక్కడికీ వెళ్ళలేని, కదల్లేని పరిస్థితి. మరొకతనికి అంధత్వం వచ్చింది. ఆడపిల్లలు వితంతువులయ్యారు. వారిని పట్టించుకునేవాడే లేడు. తన పిల్లల ఈ దుస్థితిని చూసి ధనవంతుడు దుఃఖం ఆపుకోలేక పోయాడు. భోరున ఏడ్చేశాడు. అప్పుడు అల్లాహ్ ధనికునితో, 'ప్రపంచంలో ఉన్నప్పుడు నువ్వు నా సహాయం కోరలేదు, డబ్బే సర్వస్వం అనుకున్నావు. దాని సహాయంతోనే జీవితం గడిపావు. దాని పర్యవసానం ఎలా ఉంటుందో చూశావు కదా!' అన్నాడు.

ఆ తర్వాత అల్లాహ్ రెండో ధనవంతుణ్ణి 'ప్రపంచంలో ఉండగా నీకు ధనం ఇచ్చాను కదా..... దాన్ని నువ్వు ఎలా ఖర్చుచేశావు? అని ప్రశ్నించాడు.

అతను, ఓ అల్లాహ్! నేను ఆ ధనాన్ని నీ మార్గంలో ఖర్చుచేశాను. అనాధలకు, వితంతువులకు పంచిపెట్టాను. రోగగ్రస్థులకు మంచి వైద్యం కోసం హాస్పిటళ్ళు నిర్మించాను. అనాధ బాలల కోసం పాఠశాలలు కట్టించాను. వాటిలో ధార్మిక విద్యను అర్జించే సదుపాయం కూడా కల్పించాను. వివాహాలు చేసుకోలేక పోతున్న నిరుపేద ఆడపిల్లల వివాహాలు చేయించాను. నీ ధర్మవ్యాప్తి కోసం రేయింబవళ్ళు కష్టపడుతున్నవారికి సహాయపడ్డాను. నేను మరణించే సమయానికి నా పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. ఇప్పుడు వారి పరిస్థితి ఎలా ఉందో నాకు తెలీదు' అని తాను చేసిన కార్యకలాపాల గురించి చెప్పు కొచ్చాడు.

నీ భార్యాపిల్లల కోసం ఏం వదిలిపెట్టి వచ్చావు? అని మళ్ళీ ప్రశ్నించాడు అల్లాహ్.

దానికతను ఇలా సమాధానమిచ్చాడు:

'నా భార్యకు మహర్ (వధువు సొమ్ము) కింద ఒక తోట ఇచ్చాను. పిల్లల కోసం చిన్న దుకాణం పెట్టించాను. నేను మరణించేటప్పుడు నా ఇంటివారికి హితోపదేశం చేస్తూ, 'నా సంపదలో ఇంతే మీ అదృష్టంలో ఉంది. ఇక నుండి మీ భారం అల్లాహ్‌పై వేస్తున్నాను' అని చెప్పాను.

అల్లాహ్ ఇలా అన్నాడు : 'నువ్వు నీ భార్యా పిల్లల భారం నాపై వేశావు. కనుక వారికి నా సహాయం అందింది. నువ్వు నీ భార్య కిచ్చిన తోటలో నేను అనుగ్రహాలు ప్రసాదించాను. చూడు! నీ భార్య తోట ఎలా నిండుగా ఉందో'

అతని భార్యతోట పచ్చగా కళకళలాడుతోంది. చెట్లకు పండ్లు కాసి ఉన్నాయి. ఆ దృశ్యం ఎంతో చూడముచ్చటగా ఉంది.

తోటలో ఆమె భార్య పండ్లు కోసి కుప్పలుగా పోసేది. ఆమె స్వయంగా తినేది. బీదసాదలకు కూడా పంచిపెట్టేది. భార్య మంచి స్థితిలో ఉండటం చూసి ధనవంతుడు చాలా సంతోషపడ్డాడు. అల్లాహ్ ముందు సాష్టాంగపడ్డాడు. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

తర్వాత తన పిల్లల పరిస్థితి చూడసాగాడు, పిల్లల కోసం వదిలివచ్చిన దుకాణం ముందు జనం బారులుతీరి వున్నారు. పిల్లలు చక్కగా చదువుకుని వ్యాపారం చేయసాగారు. సరుకులు కొనడానికి వచ్చేవారితో చాలా మృదువుగా

వ్యవహరించేవారు. వ్యాపారంలో అబద్ధం చెప్పేవారు కాదు. వచ్చినవారిని సంతోషపరిచేవారు. మంచి నాణ్యమైన సరుకులు అమ్మేవారు. సరుకులలో ఏమైనా లోపం ఉంటే తక్కువ ధరకు అమ్మేవారు. ప్రతి సంవత్సరం జకాత్ చెల్లించేవారు. అన్నదమ్ములందరూ ఐకమత్యంతో కలిసిమెలిసి పనిచేసేవారు. వారందరూ కలిసి ఒక ధార్మిక పాఠశాలను కూడా స్థాపించారు.

తన పిల్లలను మంచి స్థితిలో చూసిన ధనవంతుడు మళ్ళీ అల్లాహ్ ముందు సాష్టాంగపడ్డాడు. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. అల్లాహ్ ముందు కడు వినమ్రంగా ఇలా విన్నవించుకున్నాడు.

'ఓ అల్లాహ్! ఇదంతా నీ అనుగ్రహమే. ప్రపంచంలో నిన్ను నమ్ముకోవడమే సబబు. నీ ఆధారమే సత్యం. ప్రపంచంలో నీ ఆధారం తప్ప మరే ఆధారమూ సత్యంకాదు'

అల్లాహ్ తన దూతలను పిలిచి 'నా ఈ దాసుణ్ణి స్వర్గానికి తీసుకెళ్ళండి. అన్నింటికంటే ఉత్తమమైన స్థలంలో అతన్ని వదిలేయండి. అతనిపై నా అనుగ్రహాలు, కారుణ్యాలు అవతరింపజేయండి' అని ఆదేశించాడు.

3. పరీక్ష

ప్రవక్త (స) తన సహచరులకు వినిపించిన ఒక సంఘటన నను వినిపిస్తాను. వినండి, ఇది చాలా మంచి సంఘటన. దీని ద్వారా మీరు కూడా గుణపాఠం నేర్చుకోవచ్చు. ఇక ఆలస్యం ఎందుకు చదవండి...

బనీ ఇస్రాయీల్ జాతిలో ముగ్గురు వ్యక్తులుండేవారు. ఒకడు అంధుడు, ఇంకొకడు బట్టతలోడు, మరొకడు కుష్ఠురోగి. అల్లాహ్ వారి దగ్గరకు ఒక దూతను పంపించాడు. దూత అందరికంటే ముందు కుష్ఠురోగి దగ్గరకు వెళ్ళాడు. అతణ్ణి 'నీకు ఏ వస్తువంటే ఎక్కువ ఇష్టం' అని అడిగాడు. అతను 'నాకు మంచి చర్మం, మంచి శరీరం, మంచి రంగు చాలా ఇష్టం' అన్నాడు. ఆ దూత అతని శరీరంపై చేయి తిప్పాడు. వెంటనే అతనికున్న లోపం మాయమయింది. అతనికి మంచి రంగు, మంచి శరీరం వచ్చేశాయి. మళ్ళీ ఆ దూత అతన్ని 'నీకు ఏ ధనం ఎక్కువ

ఇష్టం' అని ప్రశ్నించాడు. 'నాకు ఒంటెలంటే చాలా ఇష్టం' అని బదులిచ్చాడతను. దూత అతనికి ఒక ఒంటె ఇచ్చి 'అల్లాహ్ ఇందులో నీకు అనుగ్రహం కలిగిస్తాడు' అని వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఆ దూత బట్టతల వ్యక్తి వద్దకు వెళ్ళాడు. అతన్ని కూడా అదే విధంగా ప్రశ్నించాడు. 'నీకు ఏ వస్తువు ఎక్కువ ఇష్టం' అని. దాని కతను ' నా బట్టతల పోయి అందమైన వెంట్రుకలొస్తే బాగుంటుంది, నా బట్టతలను చూసి అందరూ అసహ్యించుకుంటున్నారు' అని బదులిచ్చాడు. దూత అతని తలపై చేయి నిమిరాడు. వెంటనే అతని రోగం నయంఅయి అతని తలపై అందమైన వెంట్రుకలొచ్చేశాయి. మళ్ళీ దూత 'నీకు ఏ ధనమంటే చాలా ఇష్టం' అని అతన్ని అడిగాడు. దానికతను 'నాకు ఆవులంటే చాలా ఇష్టం' అన్నాడు. దూత అతనికి ఒక ఆవు ఇచ్చి అల్లాహ్ ఇందులో నీకు అనుగ్రహం ప్రసాదిస్తాడు అని వెళ్ళిపోయాడు.

చివరిగా ఆ దూత అంధ వ్యక్తి దగ్గరకు వెళ్ళాడు. 'నీకు ఏ వస్తువంటే ఎక్కువ ఇష్టం' అని అడిగాడు. అందుకతను నేను అంధుడిని 'నాకు చూపొస్తే చాలు' అని సమాధానమిచ్చాడు. దూత అతని కళ్ళపై చేయి తిప్పాడు. అతనికి వెంటనే చూపు వచ్చేసింది. మళ్ళీ దూత అతన్ని 'నీకు ఏ ధనం ఎక్కువ ఇష్టం' అని ప్రశ్నించాడు. 'మేకలంటే నాకు చాలా ఇష్టం' అన్నాడు. దూత అతనికి 'ఒక మేక ఇచ్చి అల్లాహ్ ఇందులో నీకు అనుగ్రహం ప్రసాదిస్తాడు' అని చెప్పి వెళ్ళిపోయాడు దూత.

అలా ముగ్గురి దగ్గరున్న జంతువులు పెరిగి పెద్దవయ్యాయి. ఒంటె లతో, ఆవులతో, మేకలతో ముగ్గురి కొట్టాలు నిండుగా కళకళలాడసాగాయి.

ఆ ముగ్గురిని పరీక్షించడానికి దూత మళ్ళీ మొట్టమొదట కుష్టు రోగి దగ్గరకు వెళ్ళాడు. 'నేనొక ప్రయాణీకుణ్ణి, నేను తెచ్చుకున్న సరుకులన్నీ మధ్యలోనే అయిపోయాయి. నేను నా ఇంటికి తిరిగి వెళ్ళలేని పరిస్థితి. నీకు అందమైన శరీరం, మంచి రంగు, అధిక ధనం ప్రసాదించిన ఆ అల్లాహ్ దయతో నాకు సహాయం చెయ్యి, నాకొక ఒంటె ఇవ్వు' అని అడిగాడు.

దానికతను 'సహాయం చేయాలనుకుంటే హక్కుదారులు చాలా మంది

ఉన్నారు. ఎవరికని ఇవ్వాలి' అని గొణిగాడు. అప్పుడు దూత 'అరే... నిన్నెక్కడో చూసినట్టుందే... నవ్వు ముందు కుష్టురోగివి కదూ! తర్వాత అల్లాహ్ నిన్ను బాగుచేశాడు కదూ!! ధనం ప్రసాదించాడు కదూ!! అన్నాడు.

ఊహించని ఆ సమాధానానికి కుష్టు రోగి బిత్తరపోయి కాదు, కాదు, నేను అతన్ని కాదు.... నువ్వు ఎవరిని చూసి ఎవరనుకుంటున్నావో... ఈ ధనమంతా నా తాత ముత్తాతలనుండి నాకు సంక్రమించింది. నువ్వేమంటున్నావో నాకస్సలు అర్థంకావడంలేదు, అంటూ అమాయకంగా సమాధానమిచ్చాడు.

అప్పుడు దూత 'ఒకవేళ నువ్వు అబద్ధం చెబుతున్నట్టయితే అల్లాహ్ నిన్ను నువ్వు ముందు ఎలా ఉంటే వాడివో అలా చేయాలి' అని శపించాడు. అతను మళ్ళీ కుష్టురోగిగా మారిపోయాడు.

తర్వాత దూత బట్టతల వ్యక్తి వద్దకు వెళ్ళాడు. అతన్ని కూడా కుష్టురోగిని ప్రశ్నించినట్లే ప్రశ్నించాడు. బట్టతల వ్యక్తి కూడా కుష్టురోగి చెప్పినట్టుగానే సమాధానమిచ్చాడు. అప్పుడు దూత 'నువ్వు గనక అబద్ధం చెప్పినట్లయితే ముందు నువ్వు ఎలా ఉండేవాడివో అలా అయిపోవాలి' అని అతన్ని కూడా శపించాడు. అతను కూడా మళ్ళీ మొదటలా మారిపోయాడు.

చివరిగా దూత అంధుడి దగ్గరకు వెళ్ళాడు. 'నేనొక అనాధను. అభాగ్యుడ్ని. నీకు ఇదంతా ప్రసాదించిన ఆ అల్లాహ్ పేర నాకు ఒక మేక ఇవ్వు' అని అడిగాడు. అప్పుడు అతను 'ఒకప్పుడు నేను అంధుడిని. అల్లాహ్ దయ తలచి నాకు చూపు ప్రసాదించాడు. అది చాలు నాకు. ఈ ధనమంతా అల్లాహ్ తన అనుగ్రహంతో ప్రసాదించాడు. నా ధనమంతా నీ ముందుంచుతున్నాను. ఇందులో నీకెంత కావాలో తీసుకెళ్ళు మిగతా ధనం వదలిపెట్టు అన్నాడు.

అప్పుడు దూత 'దీన్ని నీ దగ్గరే ఉంచు, అల్లాహ్ మిమ్మల్ని పరీక్షించాలనుకున్నాడు. అల్లాహ్ నీతో ప్రసన్నుడయ్యాడు. వారిద్దరినీ అసహ్యించుకున్నాడు. వారిద్దరూ మొదట ఎలా ఉన్నారో అలా మారిపోయారు. వాళ్ళ జంతువులన్నీ చనిపోయాయి. వాళ్ళిద్దరూ చాలా బాధలో ఉన్నారు. కాని అల్లాహ్ నీకు మరిన్ని అనుగ్రహాలు ప్రసాదిస్తాడు. పరలోకంలోనూ నీకు ఉన్నత స్థాయికి చేర్చుతాడు అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

ఈ కథను మీరు చదివారు కదా! ఎలా ఉంది? గుణపాఠం నేర్చుకునేలా, బాగా ఉంది కదా!!

ఇప్పుడు చెప్పండి. ఒకవేళ మీకే గనక అల్లాహ్ ధనవంతుడిని చేస్తే మీరు ఆ ముగ్గురిలో ఎవరిని అనుసరిస్తారు....?

4. ముష్టెత్తుకోవటం పాపం!

అనస్(రజి) చాలా కాలం ప్రియప్రవక్త ముహమ్మద్(స)గారి సేవలో ఉన్నారు. ఈ కాలంలోనే ఆయన ప్రవక్త(స) వద్ద అనేక విషయాలు నేర్చుకున్నారు. వాటినే ఆయన ఇతరులకూ నేర్పేవారు. ప్రవక్త(స) అప్పు డప్పుడూ ప్రజలకు చేస్తూ ఉన్న ప్రబోధనలను ఆయన(రజి) బాగా ఆకళింపు చేసుకున్నారు. తర్వాత వాటినే ప్రజలకు బోధించేవారు.

ఒకసారి ప్రవక్త(స) ఒక హితబోధ చేశారు. అది మానవుల గౌరవాన్ని ఇనుమడింపజేసే హితబోధ, ఎంతో మనోజ్ఞమైనది కూడాను. స్తోమత ఉండి కూడా ముష్టెత్తుకు తిరుగుతున్న వ్యక్తికి చేసిన హితబోధ అది. ప్రవక్త(స) గారి హితబోధ విధానం చాలా బాగుంటుంది. ఇతరులు కూడా ఆ విధంగానే ప్రజలకు హితబోధ చేస్తే అది వారిపై తప్పనిసరిగా ప్రభావం చూపుతుంది.

ఆ యాచించే వ్యక్తికి సంబంధించిన కథను అనస్(రజి) ఉల్లేఖనం ఆధారంగా రాస్తున్నాము. చదవండి... చదివి మీరూ గుణపాఠం నేర్చుకోండి.

అనస్(రజి) ఇలా పేర్కొన్నారు: అన్సారీలలో ఒక వ్యక్తి ప్రవక్త(స) సన్నిధికి వచ్చి దానం చేయమని అడిగాడు. (అల్లాహ్ దాసుడు అల్లాహ్‌ను కాకుండా వేరేవారి ముందు చేయిచాచడం, అడుక్కోవడం ప్రవక్త(స)కు నచ్చలేదు. ఆవ్యక్తి అలవాటును మార్చడానికి, అతనిలో మార్పు తీసుకురావడానికి ప్రవక్త(స) ఒక మంచి ఉపాయం ఆలోచించారు). ప్రవక్త(స) ఆ వ్యక్తిని 'మీ ఇంట్లో ఏదైనా వస్తువు ఉందా? అని అడిగారు.

'నా దగ్గర ఒక లావుపాటి దుప్పటి ఉంది. మా ఇంట్లో వాళ్ళు దాని సగం భాగం పరుచుకుని మిగతా సగభాగంతో కప్పుకుంటారు. ఇంకా చెక్కతో చేసిన

నీళ్ళు తాగే ఒక కప్పు కూడా ఉంది.' అని ఆ వ్యక్తి చెప్పుకొచ్చాడు.

ఆ వస్తువులను తీసుకురమ్మని ప్రవక్త(స) అతన్ని ఆదేశించారు.

అతను ఇంటికెళ్ళి ఆ రెండు వస్తువులను తీసుకొచ్చాడు. ప్రవక్త(స) వాటిని తన చేతిలో తీసుకొని పైకెత్తి 'ఈ వస్తువులను ఎవరు కొంటారు'? అని అక్కడున్నవారిని అడిగారు.

ఒకతను లేచి 'ఈ రెండింటిని నేను ఒక దిర్హమ్‌కు కొంటాన'ని బేరమాడాడు.

దానికంటే ఎక్కువ ధరకు ఎవరైనా కొంటారా? అని ప్రవక్త(స) మళ్ళీ అడిగారు. అలా రెండు మూడుసార్లు అక్కడున్నవారిని అడిగారు.

మరో వ్యక్తి లేచి 'వాటిని నేను రెండు దిర్హమ్ లకు కొనడానికి సిద్ధంగా ఉన్నాను' అన్నాడు. ప్రవక్త(స) ఆ వస్తువులను ఆ వ్యక్తికి ఇచ్చి అతని దగ్గర రెండు దిర్హమ్‌లు తీసుకున్నారు.

ప్రవక్త(స) ఆ దిర్హమ్‌లను అన్సారీ వ్యక్తికి ఇస్తూ, 'ఒక దిర్హమ్‌తో ఇంట్లో భార్యాపిల్లలకు సరిపడా సరుకులు తీసుకొని మరో దిర్హమ్‌తో ఒక గొడ్డలి కొని' తీసుకురా... అన్నారు.

ఆ వ్యక్తి బజారుకెళ్ళి ప్రవక్త(స) చెప్పినట్లు సరుకులు కొని తీసుకుని ఒక గొడ్డలి కూడా తీసుకొని ప్రవక్త(స) దగ్గరకు వచ్చాడు.

ప్రవక్త(స) తన స్వహస్తాలతో ఆ గొడ్డలికి పిడిని బిగించారు. తర్వాత ఆ వ్యక్తిని ఉద్దేశించి 'ఇక వెళ్ళు... వెళ్ళి కట్టెలు కొట్టి అమ్ముకో.... పదిహేను రోజులదాకా నాకు కనబడకు' అన్నారు. పదిహేను రోజుల వరకు బాగా కష్టపడి సంపాదించు అని ఆయన మాట ఉద్దేశ్యం.

ఆ వ్యక్తి గొడ్డలి తీసుకొని వెళ్ళిపోయాడు. కట్టెలు కొట్టి అమ్ముకో సాగాడు. పదిహేను రోజులు గడిచాక అతను ప్రవక్త(స) దగ్గరకు తిరిగొచ్చాడు. అప్పుడు అతని దగ్గర పది దిర్హమ్‌లు ఉన్నాయి. వాటిలో కొన్నింటితో ఇంటి సరుకులు కొన్నాడు. మరికొన్నింటితో బట్టలు కొన్నాడు (అది చూసి ప్రవక్త(స) చాలా సంతోషించారు).

"ప్రళయదినం నాడు ముఖంపై మచ్చతో (అంటే అడుక్కునే ఒక లోపంతో) రావడం కంటే ఇలా పనిచేసుకొని బతకటం మేలు" అని ప్రవక్త(స) అతనికి వివరిస్తూ ఇలా హితబోధ చేశారు:

అడుక్కోవడం, ముష్టెత్తుకోవడం మంచి విషయంకాదు. కేవలం మూడు రకాల వారు మాత్రమే అడుక్కోవచ్చు:

1. పేదరికంతో మరణానికి చేరువయిన వాడు. 2. అప్పుభారం కింద నలిగిపోతున్న వాడు. దాంతోపాటు ఇతర రుణగ్రస్తుల రుణానికి సంబంధించి తన జామీను ఇచ్చిన వాడు. ఆ రుణం చెల్లించే శక్తిలేక తన పరువు పోతుందనే భయంతో ఉన్నవాడు. 3. దియ్యత్★ (రక్తశుల్కం) చెల్లించవలసి ఉండి ఆ మొత్తం చెల్లించలేకపోతున్నప్పుడు.

దైవప్రవక్త(స) హితబోధను చదివారు కదా...?

ప్రవక్త(స) సహచరులు ప్రవక్త(స)గారి హిత బోదను తు.చ తప్పకుండా పాటించేవారు.

ఒక సహాబీకి ప్రవక్త(స) 'ఎవరినీ ఏదీ అడగకు' అని ఉపదేశించారు. ఆ సహాబీ ఆ విషయాన్ని ఎంత చక్కగా ఆచరించి చూపారంటే...

ఆయన గుర్రంపై ఉన్నప్పుడు కొరడా కింద పడిపోతే తనకుతోడుగా ఒక బానిస ఉన్నప్పటికీ కిందపడిన కొరడా ఎత్తి ఇవ్వమని అడిగేవారు కూడా కాదు. తనే స్వయంగా గుర్రం దిగి కిందపడిన కొరడాను తీసుకునే వారు. ఆయన ఈ ప్రవర్తన చూసి బానిస 'అయ్యగారూ! అడిగితే కొరడా తీసి నేనే మీ చేతికి అందించేవాడిని కదా?" అని విన్న వించుకునేవాడు.

దానికాయన 'ప్రవక్త(స) ఎవరినీ ఏ వస్తువూ అడగవద్దని చెప్పారు'అని సమాధానమిచ్చే వారు. చూశారా? ప్రవక్త(స) సహచరులు ఆయన (స) హిత బోధను ఎంతగా ఆచరించే వారో!

★ *ఇస్లామీయ షరీఅత్ ప్రకారం హంతకుడికి శిక్ష ఏమిటంటే నేరం రుజువయిన హంతకునికి మరణదండన విధించాలి. ఒకవేళ హతుని వారసులు అంగీకరించిన పక్షంలో వారికి కొంత ధనం ఇచ్చి కూడా హంతకుడు విడుదల పొందటానికి అవకాశం ఉంటుంది. ఇటువంటి ధనాన్ని దియ్యత్ (రక్తశుల్కం) అంటారు.*

రండి! మనం కూడా సహాబాల మాదిరిగా ఆచరించి చూపెడదాం... యాచించడం వల్ల మనిషిలో సిగ్గు అంతరిస్తుంది. యాచించే వారికి గౌరవ ముండదు. అలాంటివారిని అల్లాహ్ అస్సలు ఇష్టపడడు. అర్థమయ్యింది కదా!

5. క్షమ

రెండు మూడురోజుల క్రితం జరిగిన సంఘటన. రఫ్ఫా నా డ్రాయింగ్ బుక్‌లో నుంచి గులాబీ పువ్వు ఉన్న పేజీ చింపుకుంది. సాయంత్రం నేను ఇంటికొచ్చాను. తను ఎంతో ఉత్సాహంతో ఆ పువ్వుతో ఆడుకుంటుంది. పిచ్చిపిల్ల ఆ కాగితపు పువ్వు వాసన కూడా చూసేది. నిజమైన పువ్వుకీ, కాగితపు పువ్వుకీ తేడా తెలీని వయస్సు మరీ. కాని డ్రాయింగ్ బుక్‌లోని ఒక పేజీ ఆమె చేతిలో చూసి నాకు బాగా కోపం వచ్చింది. ఆ కోపం లోనే నేను ఆ పాపను కొట్టడం మొదలెట్టాను. మాటలు కూడా సరిగ్గా పలకడం రాని చిన్న పిల్ల తను.

'అన్నయ్య క్షమించు, అన్నయ్య క్షమించు' అని మొరపెట్టుకోసాగింది. అప్పటికే చాలా దెబ్బలు కొట్టాను. తట్టుకోలేక తను క్రింద పడిపోయింది. తన అరుపులు విని ఏమయిందో అని అమ్మ పరిగెత్తుకొచ్చింది. తనను నా చేతుల నుండి విడిపించుకొని అక్కడ్నుంచి తీసుకెళ్ళిపోయింది.

నేను కొట్టిన దెబ్బలకు రాత్రి అయ్యేసరికి రఫ్ఫాకు జ్వరం వచ్చింది. జ్వరంలో కూడా తను 'అన్నయ్య క్షమించు, అన్నయ్య క్షమించు'అని ఏడుస్తూనే ఉంది.

నాన్నగారు రోజూ ఇషా నమాజ్ తర్వాత దుకాణం నుండి ఇంటికి వస్తారు. ఆ రోజు కూడా ఇషా నమాజ్ తర్వాతే ఇంటికొచ్చారు. ఆయనకు విషయం తెలిసిపోయింది. చాలా బాధపడ్డారు.

ఒకప్పుడు ముస్లింలు క్షమించు అన్న పదం వింటే చాలు శత్రువులను కూడా ఏ హాని తలపెట్టకుండా క్షమించి విడిచి పెట్టేవారు. కాని నువ్వు సొంత చెల్లిని అదీ చిన్నపిల్లను కూడా క్షమించలేదు... అదీ ముస్లిం కుటుంబంలో

పుట్టావు... ఛ...' అన్నారు నాన్నగారు నన్ను చూస్తూ.

తర్వాత నాన్న రఫ్ఫూను ముద్దాడారు. నన్నేమీ అనలేదు. అప్పటికి నా కోపం కూడా పూర్తిగా తగ్గిపోయింది. పాపం చెల్లిని అనవసరంగా కొట్టానేమో అనిపించింది. నాన్నగారు అన్నం తిని వచ్చి మళ్ళీ చెల్లి దగ్గరే కూర్చున్నారు. నేను కూడా నాన్న ప్రక్కకు వెళ్ళి కూర్చున్నాను. పనులన్నీ ముగించుకుని అమ్మ కూడా అక్కడకు వచ్చి చేరింది. అప్పుడు నాన్న ఒక సంఘటన వినిపించారు. అది విని నేను చాలా ఆశ్చర్యపోయాను. ఆ కాలంలో ముస్లింలు ఇలా ఉండేవారా అనిపించింది. నాన్నగారు ఒక పల్లె సర్దారు సంఘటన వినిపించారు. సంఘటన ఈవిధంగా ఉంది.

ఒకసారి ఏం జరిగిందంటే... ఒక యూదుడు ఒక పల్లెటూరి ముస్లింని హత్యచేసి పారి పోయాడు. అదిచూసిన గ్రామస్థులు అతన్ని వెంబడించారు. యూద వ్యక్తి వెళ్ళి ఒక ఖర్జూరపు తోటలో దూరాడు. అక్కడున్న తోట యజమాని 'అల్లాహ్ కోసం నన్ను రక్షించండి, నా శత్రువులు నా ప్రాణాలు తీయడానికి వస్తున్నారు' అని వేడుకున్నాడు. తోట యజమాని ఒక వృద్ధుడు. 'అల్లాహ్ కోసం రక్షించండి' అనేసరికి వృద్ధుడు సంకోచించకుండా ఆ యూద వ్యక్తిని తోటలో ఓ చోట దాచాడు.

గ్రామస్థులు యూద వ్యక్తిని వెంటాడుతూ తోట దగ్గరకు వచ్చారు. వారు వృద్ధుణ్ణి 'ఇటు వైపు ఒక యూదుడు వచ్చాడు, అతను నీ కొడుకును చంపాడు, అతను ఈ ఖర్జూర తోటలోనే దూరాడు. నువ్వతన్ని చూశావా?' అని అడిగారు.

ఆ మాట వినగానే వృద్ధునికి గుండె ఆగి పోయినంత పనయింది. బాధతో తల్లడిల్లి పోయాడు. అయినా గుండె నిబ్బరం చేసుకుని 'అవును, అతను ఇక్కడకు వచ్చాడు. అతన్ని నేను నా ఇంట్లో దాచిపెట్టాను. కాని మీరు అతన్ని చంపలేరు' అన్నాడు.

గ్రామస్థులు 'లేదు, అలా జరుగడానికి వీల్లేదు. అతన్ని చంపాల్సిందే. అతన్ని విడిచి పెట్టేది లేదు' అని మొండికేశారు.

పాపం వృద్ధుడు పుత్రవియోగ దుఃఖంతో ఏడుస్తూ 'నేను అతన్ని అల్లాహ్ కోసం రక్షణ ఇచ్చాను. నేను అతన్ని క్షమించాను. మీరు అతన్ని చంపలేరు' అని అన్నాడు.

చేసేది లేక గ్రామస్థులు అక్కడినుండి వెళ్ళి పోయారు. గ్రామస్థులు వెళ్ళ గానే వృద్ధుడు యూదవ్యక్తిని పిలిచి 'ఈ గుర్రం తీసుకో, త్వరగా ఇక్కడి నుండి వెళ్ళిపో, ఎంత త్వరగా వెళితే అంత మంచిది. తోట బయట నీ ప్రాణానికి నేను బాధ్యత వహించలేను' అన్నాడు.

యూద వ్యక్తి ఇదే అదను అనుకొని గుర్రం ఎక్కి అక్కడినుండి పారిపోయాడు.

నాన్నగారు ఈ సంఘటన వినిపించి నావైపు చూశారు. నేను సిగ్గుతో తలదించుకున్నాను. అప్పటికే నా కళ్ళనుండి అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి.

6. చెంపదెబ్బ

కొన్ని రోజుల క్రితం నా మిత్రుడొకడు అలీగఢ్ వెళ్ళాడు. అక్కడ ప్రఖ్యాత కంటి ఆసుపత్రి ఒకటుంది. ఏదో కంటి సమస్యతో మిత్రుడు అక్కడికి వెళ్ళాల్సి వచ్చింది. అక్కడి నుండి తిరిగి వచ్చాక మరువలేని ఒక సంఘటన నాకు వినిపించాడు. ఆ సంఘటన నేను ఇతరులకూ వినిపిస్తుంటాను. ఇప్పుడు దాన్ని మీకోసం రాస్తున్నాను. చదవండి. చదివి గుణపాఠం నేర్చుకోండి.

నా మిత్రుడు నాకు ఇలా చెప్పాడు:

"అక్కడ హాస్పిటల్‌లో నేను ఒక బల్లమీద కూర్చుని ఉన్నాను. నాకు దగ్గర్లోనే మరో వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అతనితో తొమ్మిది సంవత్సరాల చిన్నబాబు కూడా ఉన్నాడు. నేనూ, ఆ వ్యక్తి దగ్గరగా జరిగి మాట్లాడుకోసాగాం. నేను అతన్ని 'ఏమిటీ సమస్య?' హాస్పిటల్‌కు ఎందుకొచ్చారు?' అని అడిగాను.

సమాధానంగా ఆ వ్యక్తి ఏడ్వసాగాడు. తనతో ఉన్న బాబుని చూపించి ఇలా చెప్పుకొచ్చాడు; 'ఇతను మా అబ్బాయి. ఒకరోజు ఇంట్లో మొండికేశాడు.

వాడిని నేను చాలా సముదాయించాను. నా మాట అస్సలు వినలేదు. చెప్పిచెప్పి విసుగెత్తి గద్దించాను. అయినా నామాట వినలేదు. నాకు బాగా కోపం వచ్చింది. దాంతో వాడికి ఒక్క చెంప దెబ్బ కొట్టాను. ఆ దెబ్బ అతని కణతకు తగిలింది. వెంటనే బాబు క్రిందపడిపోయాడు. వెంటనే వాళ్ళమ్మ వచ్చి అతన్ని పైకి లేపింది. చూసే సరికి అతని కనుబొమ్మ వాచిపోయి ఉంది. అది చూసి నేను చాలా గాభరా పడిపోయాను. వెంటనే అతన్ని హాస్పిటల్‌కు తీసుకొచ్చాను. డాక్టర్ గారికి జరిగిందంతా చెప్పాను. ఒక చిన్న దెబ్బకే పిల్లాడి పరిస్థితి ఇలా అయిందని వివరించాను. ఆ డాక్టర్‌గారు బాబును చూసి అలీగఢ్ కంటి ఆసుపత్రికి తీసుకెళ్ళమని సలహా ఇచ్చారు. వెంటనే బాబును చూపించడానికి ఇక్కడికి తీసుకొచ్చాను."

విషయమంతా వివరించి, మళ్ళీ ఏడ్వడం ప్రారంభించాడు ఆ వ్యక్తి. నేను ఆ అబ్బాయి వైపు చూశాను. నిజంగా అతని ఎడమ కనుగుడ్డు వాచి ఉంది. అది చూసి నాక్కూడా చాలా బాధ అనిపించింది. అప్పుడు నాకు ప్రవక్త (స) ప్రవచించిన 'కోపం షైతాన్ కార్యం' అన్న హదీసు గుర్తొచ్చింది. ఆ తర్వాత 'ఎవరినీ చెంపదెబ్బ కొట్టకండి' అన్న మరో హదీసు గుర్తొచ్చింది.

ప్రవక్త (స) ఏది చెప్పినా అది మన మంచికే చెప్పారు. కాబట్టి ప్రియప్రవక్త (స) చెప్పిన వాటిని మనం తప్పకుండా ఆచరించి చూపెట్టాలి. ఒకవేళ మనం వాటిని ఆచరించకపోతే ఇహలోకంలో ఎలాగైనా నష్టాల పాలవుతాము. అంతే కాకుండా మన కర్మల లెక్క తీసుకోబడే పరలోకంలోనూ నష్టపాలవక తప్పదు.